ధర్మారావు ఇంట్లో సీతాఫలం మొక్క పెద్దదై తొలిసారిగా రెండు కాయలు కాసింది. కాయలు ముదిరి కళ్ళు విచ్చుకుని మెత్త బడ్డాయి.

ధర్మరావు భార్య సీతమ్మ వరండాలో నిల్చుని పక్కింటి పిల్లలు రమణని, బుజ్జిగాడిని కేకేసింది.

"ఎందుకే ?" అన్నాడు ధర్మారావు.

"సీతాఫలాలు పండాయి. పిల్లలు తింటారని పిలుస్తున్నా!" అంది సీతమ్మ.

ధర్మారావు మండిపడ్డాడు.

"తొలిసారిగా పండిన ఫలాలు మనం తినాలి గాని, వూళ్ళోవాళ్ళ కిస్తావా? అదిగాక ఒక్కోకాయ ఇరవై పైసలు ఖరీదు చేస్తుంది. అదే మనం కొనుక్కుని తినాలనుకున్నామనుకో డబ్బు ఖర్చుపెట్టాల్సిందే గదా! ..." అన్నాడు.

"కొనుక్కుని తింటానికి మనం పిల్లలమటండీ. అయినా, ఈ వయసులో అలాంటివి తింటే జబ్బుచేస్తుంది కూడాను." అంది సీతమ్మ.

"చాలు చాల్లే. మహా చెప్పొచ్చావు," అని విసుక్కున్నాడు ధర్మారావు

సీతమ్మకి భర్త తత్వం తెలిసిందే గనుక మారు మాట్లాడక ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆ రోజు శనివారం. టిఫిన్ తిన్నా కడుపులో వెల్తిగానే వుంటుంది. ఆ రెండు పళ్ళూ తను తినేస్తే సరి అనుకున్నాడు ధర్మారావు.

చీకటి పడేవేళకే వర్షం మొదలయింది.

సీతమ్మ ఏడింటికే ఉప్మా చేసి భర్తకి పెట్టింది.

ధర్మారావు మనసంతా సీతాఫలాల మీదే వుంది. తెల్లారి తను లేచేసరికి భార్య కోసి ఎవరికైనా ఇస్తుందేమోనని అనుమానం వేసింది.

వర్షం వెలిసేసరికి తొమ్మిదైంది.

సీతమ్మ నిద్రపోయింది.

ధర్మారావు బ్యాట్రీలైటు వేసుకుని పెరట్లోకి వెళ్ళి రెండు పళ్ళూ తెంపుకొచ్చాడు.

చెట్టున పండిన కాయలేమో తాజాగా, నిగనిగ లాడుతున్నాయి.

ధర్మారావు ఆప్యాయంగా ఆరగించి మంచినీళ్ళు తాగి పడుకున్నాడు.

తెల్లారేసరికి పట్టుకుంది జలుబు.

ముక్కులు బిగుసుకుపోయాయి. మెదడు మొద్దుబారిపోయింది. చెవులు సరిగా వినపడడంలేదు.

సీతమ్మ నిద్ర లేచేసరికి ధర్మారావు వరండాలో నిల్చుని చీదుతూ కన్పించాడు.

"ఏమిటండీ ప్రొద్దున్నే లేచారు?" అంది సీతమ్మ.

"జలుబు చేసిందే..." అన్నాడు నెమ్మదిగా.

సీతమ్మకి అనుమానం వేసి "సీతాఫలాలు తిన్నారా? ఏం? "అంది.

ధర్మారావు అవునని అమాయకంగా తలూపాడు.

"బాగుంది. ఈ ముసుర్లో తలంటుకుని పైగా సీతాఫలాలు తిన్నారా ? అదీ రాత్రి పూట. జలుబు చెయ్యకేం చేస్తుంది. మీ పీనాసితనం తగలబడ్డట్టే వుంది. వెళ్ళి రెండు ఆస్ప్రి బిళ్ళలు వేసుకోండి. పాలల్లో మిరియాల పొడి వేసిస్తాను." అంది సీతమ్మ.

ధర్మారావు గొడుగు వేసుకుని వీధిలోకి వెళ్ళాడు.

సీతమ్మ పాలుకాచేసరికి, "పావలా వదిలింది" అంటూ వచ్చాడు ధర్మారావు.

"అప్పుడే ఏమైంది !" అని నవ్వింది సీతమ్మ.

తొమ్మిదింటికి భోజనంచేసి ఆఫీసుకి బయల్దేరాడు.

బస్‌స్టాప్‌లో తోటి గుమాస్తా సుబ్బయ్య పలకరించాడు "జలుబు చేసినట్లుందే" అని.

"అవునండీ!" అన్నాడు ధర్మా రావు నీరసంగా.

"కోడోపైరిన్ రెండేసుకోండి. తగ్గిపోతుంది," అన్నాడు సుబ్బయ్యా.

"వూ" అని మూలిగాడు ధర్మా రావు ఇప్పటికే పావలా దండగ. వేసుకున్నవి పనిచేయక పోతాయా? అనుకున్నాడు.

ఆఫీసులో కూర్చున్నాడన్న మాటే గాని పని చెయ్యబుద్ధికాలేదు. మాటి మాటికీ వరండాలోకి వెళ్ళి చీదడం మొదలెట్టాడు

మధ్యాహ్నానికి ముక్కులు మరీ బిగుసుకుపోయాయి. గాలి పీల్చడమే కష్టమైపోయింది. పోతే పోయిందని సుబ్బయ్యా సలహా ప్రకారం రెండు కోడోపైరిన్ వేసుకుని వేడి వేడి పాలు తాగాడు.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. పడుకుంటే తల భారంగావుంది ఒకటికి రెండు దిండ్లు వేసుకున్నాడు అయినా వూపిరి ఆడడంలేదు తెల్లవార్లూ వరండాలోకి వెళ్ళి వస్తూనే వున్నాడు

మర్నాడు ఉదయం సీతమ్మ మిరియాల పొడి వేసిన పాలు ఇచ్చి "విక్స్ డబ్బా ఒకటి కొని ముక్కుకు రాసుకోండి," అంది.

బస్‌స్టాప్ దగ్గర కెళ్ళి కొట్లో విక్స్ డబ్బా ఒకటి కొన్నాడు.

పక్కింటి కుర్రాడు పలకరించి "ఇన్‌హేలర్ ఒకటి తీసుకుని లోపలికి పీల్చండి గుణం కన్పిస్తుంది" అన్నాడు.

ఇప్పటికి అయిన దండగ చాల్లే అనుకున్నాడు ధర్మారావు.

ఆఫీసులో కూర్చుని జలుబుతో బాధ పడడం చూసి పక్క సీట్లో టైపిస్టు మేరీ అన్నది, "కోసావిల్ వేసుకోండి," అని.

లంచ్ అవర్లో రెండు కోసావిల్ బిళ్ళలు వేసుకుని వేడి వేడి పాలు తాగాడు.

సాయంత్రానికి అసలు వూపిరాడ లేదు

బస్‌స్టాఫ్‌కు పోతూ, పోతూ ఇన్‌హేలర్ కొనుక్కుని పీల్చసాగాడు. కొంచెం సాఫీగా వూపిరాడినట్లని పించింది.

ముక్కుకి పూసి, గుండెలకు రాసి విక్స్ డబ్బా ఖాళీ అయ్యింది. కాని రాత్రి మళ్ళీ జాగారమే తెల్లవారు జామున నిద్రపట్టింది.

పాల మనిషి కేక విని మెలకువ వచ్చింది. సీతమ్మ ఇంకా నిద్రలేవ లేదు. ఆమెని లేపడం ఎందుకని తనే పాల గిన్నె తీసుకెళ్ళి పాలు పోయించుకున్నాడు.

"అయ్యగారికి పడిశం పట్టి నట్టుందే," అంది పాల పుల్లమ్మ.

"అవును పుల్లమ్మా! ఇది మూడో

రోజు, చచ్చిపోతున్నాననుకో,'' అన్నాడు నీరసంగా.

"అమృతాంజనం పుయ్యాండి'' అంది

"విక్స్ పూశాను."

''ఇదీ పుయ్యండి...'' అని వెళ్ళి పోయింది పుల్లమ్మ.

మళ్ళీ మిరియాల పొడి పాలు త్రాగి ఆఫీసుకి వెళ్ళాడు ధర్మారావు.

"ఏమయ్యా ధర్మారావు! నీ కాగితాలు ఏవీ రావడం లేదే,'' అన్నాడు సూపరెన్నెంట్.

"జలుబు చేసిందండీ. బుర్ర పన్జేయడంలేదు," అన్నాడు ధర్మారావు చిరునవ్వుతో.

''అలాగా! మాత్రిబాన్ బిళ్ళలు రెండు పూటలు వేసుకో. దెబ్బకుపోతుంది" అని సలహా ఇచ్చాడు సూపరెన్నెంటు.

లంచ్ అవర్లో సూపరెన్నెంటు సలహా పాటించాడు ధర్మారావు. రెండు బిళ్ళలూ ఒకేసారి వేసుకుని వేడి వేడి పాలు త్రాగాడు.

సాయంత్రానికి గూడా ఏమీ తగ్గలేదు.

ఇంటికి పోతూ అమృతాంజనం సీసా ఒకటి కొనుక్కుని వెళ్ళాడు.

ఆ రాత్రికి అన్నం సహించలేదు. మిరియాల చారుతో నాలుగు మెతుకులు తిని లేచాడు.

అమృతాంజనం ముక్కుకి, గుండెలకు రాస్తూ ముసిముసి నవ్వులు నవ్వుకుంది సీతమ్మ

"నేను ఛస్తుంటే నీకు నవ్వుగా వుందా ?" అని మండిపడ్డాడు.

"బాగుంది. లోభికి నాలుగందాల నష్టమని పెద్దలు పూరికినే అన్నారా?" అంది.

మాట్లాడకుండా పడుకున్నాడు. అతని కళ్ళకి సీతాఫలాలు కన్పించాయి బాధగా మూలిగాడు.

తెల్లవారిన తర్వాత గూడా పరిస్థితిలో మార్పు లేకపోగా విషమించింది అసలే చీకలేక చస్తుంటే దానికి తోడు దగ్గు పట్టుకుంది.

ఇక లాభంలేదని ఆ పూట సెలవు పెట్టి డాక్టర్ని కలుసుకున్నాడు.

కన్సల్టింగ్ ఫీజు ఐదు రూపాయలు చెల్లించాక డాక్టర్‌గారు టెస్ట్ చేసి ప్రిస్క్రిప్షన్ చీటి చేతిలో పెట్టాడు.

అది మెడికల్ షాపులో చూపిస్తే, ఒక కాఫ్ సిరఫ్ బాటిల్, అరడజను కాప్స్యూల్సు పాక్ చేసి పదిరూపాయల బిల్లు చేతికిచ్చాడు.

గుండె జల్లుమంది ధర్మారావుకి.

ఆ పూటకి అన్నం సహించలేదు

ముక్కుతూ మూలుగుతూ ఆఫీసు కెళ్ళాడు. సీట్లో కూర్చోబుద్ధికాలేదు. తల భారం ఎక్కువైంది. రెండు కాగితాలు డిస్పోజ్ చేసేటప్పటికే తల నొప్పి వచ్చింది. కొంచెం జ్వరం



గూడా వచ్చినట్లుంది. ఎలాగో శైమ యిందాకా కూర్చుని ఇంటి కొచ్చాడు.

డాక్టర్ గారు వ్రాసిచ్చిన కాప్సూల్స్, కాఫ్ సిరఫ్ బాటిల్ మూడు రోజుల్లో పూర్తిగా వాడేశాడు. దగ్గు కొంచెం తగ్గింది కాని, జలుబు మాత్రం తగ్గలేదు.

పోయి మెడికల్ షాపు యజమానితో హిస్టరీ అంతా చెప్పుకున్నాడు.

"ఇదిగోండి. మూడు టెర్రోమైసన్ కాప్సూల్స్ పూటకొకటి వేసుకోండి తగ్గిపోతుంది,'' అని రెండ్రూపాయల్లు పుచ్చుకున్నాడు

వాటి సిగదరగ అవీ పన్జేయలేదు.

మళ్ళీ డాక్టర్‌తో మొరపెట్టుకున్నాడు ధర్మారావు.

"ఎస్కోల్డ్ రెండు వాడి చూడండి." అని రాసిచ్చాడు డాక్టర్.

రెండ్రూపాయలు పుచ్చుకుని రెండిచ్చారు మెడికల్ షాపులో.

ధర్మారావు జలుబు వయసు పది రోజులు దాటిపోయింది. అది ఏ మందులకీ లొంగలేదు.

"నస్యం ఒక పట్టు పట్టండి" అని సలహా ఇచ్చాడు రామశాస్త్రి గారని శివాలయం పూజారి.

నలభై పైసలిచ్చి నస్యం డబ్బా కొనుక్కొచ్చి రాత్రంతా ముక్కుకి పట్టించాడు ధర్మారావు.

ఒకటే తుమ్ములు. ముక్కు వెంట నీరుకారడం.

తెల్లవారేసరికి ముక్కు మంట పుట్టింది గాని జలుబు పారిపోలేదు.

"ఏమోయ్ ధర్మారావ్! జలుబు ఇంకా తగ్గనే లేదనుకుంటాను." అన్నాడు సుధాకర్ పక్క సీట్లో గుమాస్తా.

"లేదోయ్ :... నన్ను పట్టుకుని చంపుతోంది..." అని జలుబుని పట్టుకుని తిట్టాడు ధర్మారావు.

"జలుబుకి మందు లేదోయ్! ఒకటే మందు." అన్నాడు సుధాకర్.

"అదేంటో చెప్పి పుణ్యం గట్టుకో!" అని బ్రతిమాలాడు.

"ఏం లేదు. ఆనక బార్ కెళ్ళి రెండు పెగ్గులు బ్రాందీ కొట్టు. తర్వాత ఒక కోడి పని పట్టు. తెల్లారితే జలుబుంటే ఒట్టు," అన్నాడు సుధాకర్.

ధర్మారావు గుండె ఆగిపోయింది. ఈ నలభై ఏళ్ళ వయసులో ఎన్నడూ బ్రాందీ వాసన గూడా చూసి ఎరగడు. పిల్లా పీచూ లేకపోయినా పీనాసిగానే బ్రతుకుతున్నాడు చుట్టాలిళ్ళల్లో తప్ప కోడిని కొని తిని ఎరగడు

జలుబు బాధ పడలేక మార్కెట్ కి వెళ్ళాడు.

కాళ్ళరిగేటట్లు తిరిగి, తిరిగి బేరమాడి ఆడి పన్నెండుకి ఒక కోడి దొరికింది.

ధర్మారావు అదృష్టమేమోగాని కోడిని తిన్నా జలుబు మాత్రం పోలేదు

పగలు కొంచెం తగ్గినట్లనిపించినా రాత్రికి వూపిరాడేవి కాదు.

"నువ్వు చెప్పిన మందు పన్జేయలేదోయ్," అన్నాడు ధర్మారావు, మర్నాడు.

"ఏమిటి నువ్వు బ్రాందీ త్రాగావా?" అన్నాడు సుధాకర్ ఆశ్చర్యంగా.

"లేదు. కోడి తిన్నా!" అన్నాడు ధర్మారావు,

"అబ్బే లాభంలేదు. ఈ సారి రెండూ కలిపి చూడు. వెంటనే గుణం కన్పిస్తుంది," అన్నాడు సుధాకర్.

ధర్మారావు ఆలోచనలో పడ్డాడు.

ఆలోచించి, ఆలోచించి ఏమైతేఅయ్యిందని ఆఫీసు వదిలిన తర్వాత అటూ, ఇటూ చూసి స్వాగత్ బార్ లోకి ప్రవేశించాడు ధర్మరావు.

ఏం త్రాగాడో ఏం తిన్నాడో ధర్మారావుకి జ్ఞాపకం లేదుగాని పాతిక రూపాయల బిల్లు చెల్లించడం మాత్రం గుర్తుంది.

తలనెప్పిగా ఉంటే మీ మందు పుచ్చుకున్నానండీ!!

బార్ లోంచి బైటికి వచ్చాక బస్ స్టాప్ వరకూ నడవలేకపోయాడు. కాళ్ళు తేలిపోయాయి. బస్ నెంబర్లు గూడా సరిగా కన్పించడంలేదు. ఒక బస్ ఎక్కబోయి ఇంకోటి ఎక్కితే కొంప మునుగుతుంది అనుకుని ఆటో రిక్షా కేకేస్తూ రోడ్డు మధ్యకు వెళ్ళాడు బాలన్సు తప్పిపోయి క్రింద పడిపోయాడు. పాపం యాక్సిడెంట్ అయ్యింది. ఒక టాక్సీ గుద్దింది. కాలు విరిగింది పాపం.

హాస్పటల్లో జేర్పించారు. అక్కడ మూడు నెలలు వున్నాడు. తర్వాత మామూలుగా నడవసాగాడు ధర్మారావు.

ఆ రోజు ఆదివారం.

ధర్మారావు దగ్గరుండి సీతాఫలం చెట్టు నరికించి, మళ్ళీ చిగుర్లు వేస్తుందేమోనని త్రవ్వించి వేళ్ళతో సహా తీయించేస్తున్నాడు.

"ఏమిటండీ! ఏదో చేయిస్తున్నారు," అంటూ వచ్చాడు రామశాస్త్రి.

"ఏంలేదండీ. సీతాఫలంచెట్టు కొట్టించేస్తున్నా!" అన్నాడు ధర్మారావు.

"అదేం?" అన్నాడు రామశాస్త్రి ఆశ్చర్యపోతూ.

"ఏంలేదు అచ్చిరాలేదు...'' అని పొడి నవ్వు నవ్వాడు ధర్మారావు